# 98. అల్ బయ్యినహ్ (స్పష్టమైన నిదర్శనం) సూరా

## పరిచయం

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 8 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర గురించి బోధించింది. మొదటి ఆయతులో వచ్చిన 'బయ్యినహ్' (స్పష్టమైన నిదర్శనం) అన్న ప్రస్తావనను ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. గ్రంథప్రజలు, విగ్రహారాధకులు సత్యాన్ని తిరస్కరించడాన్ని ఈ సూరాలో ఖండించడం జరిగింది. వారు స్పష్టంగా కనబడుతున్న సత్యాన్ని అహంభావంతో తిరస్కరించడమే కాదు, దేవుని ఏకత్వాన్ని నిరాకరించడం కొనసాగిస్తున్నారు. నిజానికి గ్రంథప్రజలు (యూదులు, క్రయిస్తవులు) అందరికన్నా ముందుగా ఈ దైవవాణిని ఆహ్వానించి స్వీకరించి ఉండాల్సిందని, ఎందుకంటే వారి ఆకాశగ్రంథాలు ఈ విషయమై వారికి బోధించాయని ఈ సూరా తెలియజేసింది. కేవలం అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని, నమాజు స్థాపించాలని, జకాత్ చెల్లించాలని బోధించడం జరిగింది. నరకాగ్ని గురించి హెచ్చరించడంతో పాటు సన్మార్గులకు లభించే స్వర్గవనాల గురించి కూడా ప్రస్తావించడం జరిగింది.

## 98. అల్ బయ్యినహ్[1] సూరా

سُورَةُ الْبَيِّنَةِ

అవతరణ :మదీనా ఆయతులు : 8

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

**1** గ్రంథవహులకు చెందిన తిరస్కారులు,[2] బహుదైవారాధకులు[3] తమ వద్దకు స్పష్టమైన నిదర్శనం రానంతవరకూ (తమ తిరస్కార వైఖరిని) మానుకోనివారుగా ఉండేవారు. (ఇంతకీ ఆ నిదర్శనం ఏమిటంటే…)

لَمْ يَكُنِ الَّذِينَ كَفَرُوا مِنْ أَهْلِ الْكِتَابِ وَالْمُشْرِكِينَ مُنفَكِّينَ حَتَّىٰ تَأْتِيَهُمُ الْبَيِّنَةُ ①

**2** పరిశుద్ధమైన గ్రంథ పత్రములను[4] చదివి వినిపించే దైవప్రవక్త[5] వారి వద్దకు రావాలి.

رَسُولٌ مِّنَ اللَّهِ يَتْلُو صُحُفًا مُّطَهَّرَةً ②

1. ఈ సూరాను 'లమ్ యకున్' సూరాగా కూడా వ్యవహరిస్తారు. దైవప్రవక్త (సఅసం) ఒకసారి ఉబై బిన్ కాబ్ (రజి)తో "లమ్యకునిల్లజీన సూరాను నీకు చదివి వినిపించవలసిందిగా దేవుడు నన్ను ఆజ్ఞాపించాడు" అన్నారు. దానికి హజ్రత్ ఉబై (రజి), "ఏమిటీ, దేవుడు నా పేరుపెట్టి మరీ ఇలా చెప్పాడా?" అని అడిగారు. "అవున"న్నారాయన (స). అప్పుడు (ఆనందంతో) హజ్రత్ ఉబై గారి కళ్లలో నీళ్లు ఉబికి వచ్చాయి (సహీహ్ బుఖారీ – లమ్ యకున్ సూరా వ్యాఖ్యానం).
2. ఇక్కడ **'గ్రంథవహులు'** అంటే యూదులు, క్రైస్తవులని గమనించాలి.
3. **'బహు దైవారాధకులు'** అంటే విగ్రహాలను, చెట్లను, పుట్టలను, అగ్నిని పూజించే అరబ్బులు, అరబ్బేతరులు. **'స్పష్టమైన నిదర్శనం'** (బయ్యినహ్) అంటే మహాప్రవక్త ముహమ్మద్ (స). ఈ వాక్యం యొక్క సారాంశం ఏమిటంటే, యూదులు క్రైస్తవులు తమకు ఖుర్ఆన్ గ్రంథ వాక్యాలను చదివి వినిపించి, తమ మార్గవిహీనత గురించి విడమరచి చెప్పే, తమను విశ్వాసమార్గం వైపు పిలిచే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) తమ వద్దకు రానంతవరకూ తమ పెడసరి పోకడలను విడిచిపెట్టరు.
4. అంటే – లౌహె మహ్ఫూజ్లో సురక్షితంగా ఉన్న దివ్య ఖుర్ఆన్ అన్నమాట.
5. అంటే దేవుని చిట్టచివరి ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) అన్నమాట.

فِيهَا كُتُبٌ قَيِّمَةٌ ۝٣

**3** మరి వాటిలో (ఆ గ్రంథపత్రాలలో) స్థిరమైన, సవ్యమైన ఆదేశాలు ఉండాలి.[6]

وَمَا تَفَرَّقَ الَّذِينَ أُوتُوا الْكِتَابَ إِلَّا مِنْ بَعْدِ مَا جَاءَتْهُمُ الْبَيِّنَةُ ۝٤

**4** మరి (ఈ) గ్రంథవహులు తమ వద్దకు స్పష్టమైన నిదర్శనం వచ్చేసిన తరువాతే (విభేదించుకుని) చీలిపోయారు.[7]

وَمَا أُمِرُوا إِلَّا لِيَعْبُدُوا اللَّهَ مُخْلِصِينَ لَهُ الدِّينَ حُنَفَاءَ

**5** వారు అల్లాహ్‌నే ఆరాధించాలని, ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలనీ, ఏకాగ్రచిత్తులై[8] – నమాజును నెలకొల్పాలనీ, జకాత్‌ను ఇస్తూ ఉండాలని

---

6. ఇక్కడ **'కుతుబున్'** ( كُتُبٌ ) అంటే శాసనాలు, ఆదేశాలు, నిర్దేశిక నియమాలు, మార్గదర్శక సూత్రాలు అని భావం. **'ఖయ్యిమతున్'** ( قَيِّمَةٌ ) అంటే స్థిరమైనవి, సవ్యమైనవి, నిర్దిష్ట మైనవి, ఖచ్చితత్వం గలవి, సమత్వం సమతూకంతో కూడుకున్నవి అని అర్థం.

7. అంతిమ దైవప్రవక్త (సఅసం) వారి రాకకు ముందు గ్రంథం ప్రసాదించబడిన ప్రజలు కలసికట్టుగా ఉండేవారు. కాని అంతిమ ప్రవక్త (సఅసం) ప్రభవనం జరగగానే వారు విభేదించుకున్నారు. వారిలో కొందరు విశ్వసించగా అనేకులు విశ్వాస భాగ్యానికి నోచుకోకుండాపోయారు. ముహమ్మద్ (స) వారి రాకను, ఆయన దైవదౌత్యాన్ని 'స్పష్టమైన నిదర్శనం'గా పేర్కొనటంలోని ఔచిత్యం ఏమిటంటే ఆయన్ని దైవప్రవక్తగా విశ్వసించటం వినా మార్గాంతరం లేదు. కాని గ్రంథవహులు కేవలం అసూయతో, వైరభావంతో ఆయన్ని ధిక్కరించారు. ఈ కారణంగానే విభేదించుకున్న వారి జాబితాలో కేవలం గ్రంథవహుల (యూదుల, క్రైస్తవుల) పేర్లు మాత్రమే ప్రస్తావించబడ్డాయి. మరి చూడబోతే ఇతరులు కూడా ఈ విషయంలో విభేదించుకోకపోలేదు. అయితే గ్రంథవహులు జ్ఞానసంపన్నులు, అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) లక్షణాల గురించి క్షుణ్ణంగా తెలిసి ఉండి కూడా ఆయన్ని త్రోసిపుచ్చటం చాలా తీవ్ర విషయమవటంచేత వారిని గురించి ఇక్కడ ప్రత్యేకంగా ఎత్తిచూపటం జరిగింది.

8. **'హనీఫ్'** ( حَنِيفٌ ) అంటే ఏకోన్ముఖుడు, మనసును పూర్తిగా లగ్నం చేసుకున్నవాడు అని అర్థం. **'హునఫాఅ'** ( حُنَفَاءُ ) అనేది బహువచనం. షిర్క్ నుండి ఏకదైవారాధన వైపుకు మరలాలనీ, ఇతరత్రా మతధర్మాలతో, మిథ్యా వాదాలతో తెగత్రెంపులు చేసుకుని

మాత్రమే వారికి ఆదేశించబడింది.[9] ఇదే స్థిరమైన, సవ్యమైన ధర్మం.[10]

وَيُقِيمُوا الصَّلٰوةَ وَيُؤْتُوا الزَّكٰوةَ وَذٰلِكَ دِينُ الْقَيِّمَةِ ﴿٥﴾

**6** గ్రంథవహులలో తిరస్కారవైఖరికి పాల్పడినవారు, బహుదైవారాధకులు తప్పకుండా నరకాగ్నికి ఆహుతి అవుతారు. వారందులో కలకాలం ఉంటారు. వారు సృష్టితాలలో అందరి కంటే చెడ్డవారు.[11]

إِنَّ الَّذِينَ كَفَرُوا مِنْ أَهْلِ الْكِتٰبِ وَالْمُشْرِكِينَ فِي نَارِ جَهَنَّمَ خٰلِدِينَ فِيهَا أُولٰٓئِكَ هُمْ شَرُّ الْبَرِيَّةِ ﴿٦﴾

**7** అయితే విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారు; నిశ్చయంగా సృష్టిలో వారే అందరికన్నా ఉత్తములు.[12]

إِنَّ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصّٰلِحٰتِ أُولٰٓئِكَ هُمْ خَيْرُ الْبَرِيَّةِ ﴿٧﴾

ఇస్లాం ధర్మానికే పూర్తిగా అంకితం అయిపోవాలనీ, ఈ విషయంలో దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) స్థిరచిత్తాన్ని ఆదర్శంగా తీసుకోవాలని గ్రంథవహులకు చెప్పటం జరిగింది.

9. అంటే – వారి గ్రంథాలైన తౌరాతు, బైబిల్‌లలో వారికి ఈ ఆదేశాలు ఇవ్వబడ్డాయి.

10. అరేబియాలోని ముష్రిక్కులు బహుదైవారాధన చేస్తూనే ఇబ్రాహీము ప్రవక్త సన్మార్గాన ఉన్నాడని గొప్పలు చెప్పుకునేవారు. మరి చూడబోతే ఖుర్ఆన్ ప్రబోధించే మార్గం ఇబ్రాహీం అనుసరించిన మార్గమే. అందువల్ల బహుదైవారాధకులు ఖుర్ఆనును త్రోసిపుచ్చినట్లయితే ఇబ్రాహీము మార్గాన్ని కూడా త్రోసిపుచ్చినట్లే లెక్క. వారు గనక సవ్యమైన ధర్మంపై ఉండాలంటే ఒక్కడైన అల్లాహ్‌ను నిష్కల్మషమైన మనసుతో నమ్మాలి. నమాజులు చేయాలి. విధి దానాలు ఇస్తూ ఉండాలి. ఇదే ఖుర్ఆను మార్గం, ఇదే ఇబ్రాహీం విధానం కూడా! ఈ ఆయతు ప్రకారం మనిషి కర్మలు ఈమాన్ (విశ్వాసం)లో అంతర్లీనమై ఉంటాయని చాలామంది ఇమాములు సూత్రీకరించారు (ఇబ్నె కసీర్).

11. దైవప్రవక్తలను, దైవగ్రంథాలను తిరస్కరించే వారికి పట్టే దుర్గతి ఇది. పైగా వారు జీవరాశులలోకెల్లా నీచమైన వారుగా ఖరారు చేయబడ్డారు.

12. అంటే – హృదయపూర్వకంగా విశ్వసించి, మంచిపనులను ధనపరంగానూ, శారీరకంగానూ చేసినవారు సృష్టితాలలోకెల్లా శ్రేష్ఠులుగా ఖరారు చేయబడతారు. విశ్వాసులైన

جَزَآؤُهُمْ عِنْدَ رَبِّهِمْ جَنّٰتُ عَدْنٍ تَجْرِیْ مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ خٰلِدِیْنَ
فِیْهَآ اَبَدًا ؕ رَضِیَ اللّٰهُ عَنْهُمْ وَرَضُوْا عَنْهُ ؕ ذٰلِكَ لِمَنْ خَشِیَ رَبَّهٗ ﴿٨﴾

**8** వారికి ప్రతిఫలంగా వారి ప్రభువు దగ్గర శాశ్వతమైన స్వర్గవనాలున్నాయి. వాటి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. వాటిలో వారు కలకాలం ఉంటారు. అల్లాహ్ వారిపట్ల ప్రసన్నుడయ్యాడు.[13] వారు అల్లాహ్‌పట్ల సంతోషపడ్డారు.[14] ఈ అనుగ్రహభాగ్యం తన ప్రభువుకు భయపడే వానికి మాత్రమే.[15]

మనుషులు దైవదూతల కన్నా గొప్పవారని విద్వాంసులు భావిస్తున్నారు. దానికి వారు చూపే నిదర్శనాలలో ఈ ఆయతు కూడా ఒకటి.

13. వారి విశ్వాసం (ఈమాన్), విధేయత, సదాచరణ మూలంగా వారికీ అనుగ్రహ భాగ్యం దక్కింది. "అల్లాహ్ ప్రసన్నత అన్నింటికన్నా గొప్పది" (తౌబా – 72) కదా!

14. అవును. దేవుడు వారికి ప్రసాదించిన అనుగ్రహాలే అలాంటివి మరి! వాటితో వారి తనువు మనసూ – రెండూ పులకించాయి.

15. అంటే – ఇహలోకంలో దైవానికి నిత్యం భయపడుతూ, దేవుని అవిధేయతకు ఒడిగట్ట కుండా జాగ్రత్తగా జీవితం గడిపిన వారికి మాత్రమే ఈ వరాలు ప్రత్యేకం. ఒకవేళ ఎప్పుడైనా మానవ సహజమైన దౌర్బల్యం వల్ల తప్పు జరిగిపోయినా వారు వెంటనే తమ తప్పును గ్రహించి పశ్చాత్తాపపడతారు. క్షమాపణ కోరుకుంటారు. ఇకమీదట అలాంటి తప్పు జరగకుండా జాగ్రత్తపడతారు. కడకు వారు విశ్వాసస్థితిలోనే తనువు చాలిస్తారు. దీని భావం ఏమిటంటే నిజంగా దైవానికి భయపడేవ్యక్తి పాప కార్యాలను పదే పదే చేయడు. ఎవరయితే ఈ విధంగా చేస్తాడో అతని మనసులో దైవభీతి లేనేలేదు.